చైర్మన్ పదవి దక్కేది ఎవరికో !

- చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఆశావహుల ఎదురుచూపు
- ఈసారి తమకు అవకాశం కల్పించాలంటున్న మునుగోడు మండల నాయకులు


చండూరులోని మార్కెట్ యార్డు

మునుగోడు: కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్న చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోనని ఆ మార్కెట్ పరిధిలోని మండలాల కాంగ్రెస్ నాయకులు ఎదురుచూస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలను రద్దుచేసింది. అంతే కాకుండా చైర్మన్ల నియామకానికి రిజర్వేషన్లు సైతం సిద్ధంచేసి నూతన చైర్మన్ల ఎన్నికకు ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా చండూరు మార్కెట్ చైర్మన్ పదవి బీసీ జనరల్ రిజర్వేషన్ ఖరారయింది. దీంతో మార్కెట్ పరిధిలోని చండూరు, మునుగోడు, గట్టుప్పల్ మండలాలతోపాటు సంస్థాన్‌నారాయణపురం మండలాల కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసి తమకు మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. కానీ ఆ చైర్మన్ పదవిని నేటికీ భర్తీ చేయలేదు. దీంతో చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో అనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో మెదులుతోంది. ఇటీవల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు వ్యవసాయ మార్కెట్‌లకు చైర్మన్‌లను ఎంపిక చేశారు. పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారాలు కూడా చేశారు. దీంతో అతి త్వరలో చండూరు చైర్మన్ నియామకం ఉంటుందని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఎలాగైనా చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది.

కోటి ఆశలతో మునుగోడు నాయకులు..

1977 వరకు చిట్యాల మార్కెట్ పరిధిలో కొనసాగిన మార్కెట్‌ను చండూరు, మునుగోడు, సంస్థాన్ నారాయణపురం మండలాలను విభజించి నూతనంగా చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని 1978లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడుగురు చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు దక్కించుకున్నారు. అందులో చండూరు, నారాయణపురం మండలాల నాయకులు అధికంగా చైర్మన్ పదవిలో కొనసాగారు. గత మూడు దఫాలు వీరిలో ఇద్దరు చండూరు మండల నాయకులకు పదవి దక్కగా ఒకమారు నారాయణపురం మండల నాయకుడికి దక్కింది. గత 20 ఏళ్లుగా మునుగోడు మండలానికి చెందిన నాయకులకు చైర్మన్ పదవి దక్కలేదు. దీంతో ఈ దఫా పక్కా మునుగోడు మండలానికి చెందిన నాయకులకే దక్కుతుందని మునుగోడు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నమ్మకంతో ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉండి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో చైర్మన్ పదవి ఒప్పదంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు తమకే చైర్మన్ పదవి దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. ఎంతోకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న తమకే పదవి దక్కుతుందని మరికొందరు ధీమాతో ఉన్నారు. చైర్మన్ పదవి ఏ మండలానికి చెందిన నాయకుడికి దక్కుతుంది.. ఎప్పటిలోపు చైర్మన్ అభ్యర్థిని ప్రకటిస్తారనే అంశంపై కాంగ్రెస్ నాయకుల్లో, సామాన్య ప్రజల్లో నిత్యం చర్చ కొనసాగుతోంది.

బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత


బహుమతులు అందుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

నల్లగొండ: బతుకమ్మ పండుగకు రాష్ట్రంలో ఎంతో విశిష్టత ఉందని అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, పూర్ణచందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు వారు హాజరై మాట్లాడారు. జిల్లాలోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగినులు భారీగా తరలివచ్చి బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించినందుకు అభినందించారు. గురువారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు వల్లభరావు చెరువు దగ్గర నిర్వహించాలని, అక్కడకు కూడా పట్టణ మహిళలతో పాటు, ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు బతుకమ్మలతో తరలిరావాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర మాట్లాడుతూ నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారంతో అమ్మవారు చివరి అలంకరణ ఉంటుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు బతుకమ్మ ఉత్సవాల్లో బాల సదనం బతుకమ్మకు మొదటి బహుమతి, ఆర్డీఓ కార్యాలయ బతుకమ్మకు రెండో బహుమతి, మున్సిపల్, మెప్మా బతుకమ్మలకు మూడో బహుమతి ప్రకటించి బహుమతులను అందజేశారు. విద్యుత్ శాఖ, ఐసీడీఎస్ తిప్పర్తి శాఖలు కన్సోలేషన్ బహుమతులను గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విలేకరుల పాత్ర కీలకం

చిట్యాల: సమాజంలోని ప్రజలను చైతన్య పరచడంలో గ్రామీణ ప్రాంత విలేకరుల పాత్ర కీలకమైనదని తెలంగాణ ఉద్యకారుడు కుసూరు సంజయ్‌దాస్‌గౌడ్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా చిట్యాలలో బుధవారం మండలంలోని పత్రికా విలేకరులను శాలువాలతో సత్కరించి పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విలేకరులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సాత్విక, ఉయ్యాల రాజుగౌడ్, పురం ప్రశాంత్ పాల్గొన్నారు.

సరస్వతీ దేవి ఆలయానికి భక్తుల తాకిడి


అడ్లూరులోని శ్రీవీణగాణనృత్య సరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న భక్తులు

శాలిగౌరారం: రాష్ట్రంలో రెండో బాసరగా ప్రసిద్ధిగాంచిన శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామంలో గల శ్రీవీణగాణనృత్య సరస్వతీ దేవి ఆలయంలో బుధవారం అక్షరాభ్యాసం, పూజలు ఘనంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు దుర్గామాత సరస్వతిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. సరస్వతీదేవి జన్మనక్షత్రం మూలానక్షత్రం కూడా కలిసి రావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. సరస్వతీ దేవిని దర్శించుకుని తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ పూజారి, వంశపారంపర్య ధర్మకర్త పానుగంటి అశోకాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబరాలను జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినులు బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు.
–సాక్షి నెట్‌వర్క్


జిల్లా కోర్టులో బతుకమ్మకు పూజలు చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు


నార్కట్‌పల్లి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బతుకమ్మలతో ఉద్యోగులు


నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న ఆర్డీఓ, తహసీల్దార్లు


ఎన్జీ కాలేజీలో బతుకమ్మ ఆడుతున్న వివిధ శాఖల సిబ్బంది


ఎన్జీ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న జిల్లా అధికారులు


స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మను తీసుకొస్తున్న అధికారులు


నల్లగొండ తహసీల్దార్ కార్యాలయ బతుకమ్మకు బహుమతి అందజేస్తున్న ఆర్డీఓ శ్రీదేవి


బతుకమ్మలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచంద్ర


బతుకమ్మలతో విద్యుత్ శాఖ అధికారులు


నల్లగొండ: జెడ్పీ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు


నల్లగొండ: ఎఫ్‌సీఐ కార్యాలయ ఆవరణలో బతుకమ్మను పేర్చిన ఉద్యోగినులు

చిట్యాలలో 14 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక

చిట్యాల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరంతా హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందుకున్నారు. గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన గాదరి స్వప్న(స్కూల్ అసిస్టెంట్), గోపగోని శ్రీనివాస్(ఎస్‌జీటీ), గోపగోని ఉజ్వల(ఎస్‌జీటీ), ఎండీ.అరీఫ్(హెచ్‌పీటీ), గోపగోని స్వప్న (ఎస్‌జీటీ), రాచకొండ గాయత్రి(ఎస్‌జీటీ), కుంభం రజిత(ఎస్‌జీటీ)లతోపాటు 2008 డీఎస్సీ బ్యాచ్‌కు చెందిన ఏసిరెడ్డి రమాదేవి(ఎస్‌జీటీ) ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అదే విధంగా ఉరుమడ్ల గ్రామానికి చెందిన బొడ్డు సంధ్య (ఎస్‌జీటీ), సుంకరి సుధాకర్‌గౌడ్(ఎస్‌జీటీ) ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వెలిమినేడు గ్రామానికి చెందిన మస్కు విజయ(ఎస్‌జీటీ), కూరెళ్ళ సింధు(ఎస్‌జీటీ), పెరిక లింగస్వామి(స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పెద్దకాపర్తి గ్రామానికి చెందిన ఏర్పుల లలిత(ఎస్‌జీటీ)ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యింది.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

శాలిగౌరారం: ఇటీవల తండ్రిని కోల్పోయిన శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్‌కాలనీకి చెందిన రావుల సతీష్‌కు అతడి చిన్ననాటి స్నేహితులు బాసటగా నిలిచారు. అతడితో కలిసి చదువుకున్న 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు బుధవారం సతీష్ ఇంటికి వెళ్లి అతడి తండ్రి యలమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్‌కు రూ.25 వేలు నగదు అందజేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


డి. వర్షిని


కె. శ్రీజ

శాలిగౌరారం: మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి.వర్షిని, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.శ్రీజ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి బుధవారం తెలిపారు. విద్యార్థినులు ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సీనియర్ జట్టు తరఫున బుధవారం నుంచి ఈ నెల 11 వరకు రంగారెడ్డి జిల్లా తుర్కాంజల్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

మునుగోడు: హర్యానా రాష్ట్రంలో బీజేపీ విజయం సాధించడంతో బీజేపీ నాయకులు బుధవారం మునుగోడులో సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, బండారి యాదయ్య, కర్నాటి లింగయ్య, అక్కెనపల్లి సతీష్, బొల్లూరి రమేష్, కృష్ణ, పందుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు: హర్యానాలో బీజేపీ మరోమారు అధికారంలోకి రావడంతో చండూరులో బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయి పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కోమటిక వీరేశం, మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, బోడా ఆంజనేయులు, భూతరాజు శ్రీహరి, సముద్రాల వెంకటేశ్వర్లు, రావిరాల శ్రీను పాల్గొన్నారు.

దాడుల నియంత్రణలో విఫలం

చిట్యాల: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి విమర్శించారు. చిట్యాలలో బుధవారం జరిగిన ఆ సంఘం మండల మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. మేడి సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, పార్వతమ్మ, శ్రీవేణి, అరుణ, గీతా, కృష్ణవేణి, అరుణ, శ్రీదేవి, లక్ష్మి, యాదమ్మ, అలివేలు, ప్రియదర్శిని పాల్గొన్నారు.

● సరస్వతీ దేవిగా అమ్మవారు


కనగల్ : దర్వేశిపురం ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు


శాలిగౌరారం : అడ్లూరు ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణ


నల్లగొండ: అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ నవీన్‌కుమార్, భవానీ స్వాములు


నకిరేకల్ : ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

నోట్‌పుస్తకాలు, పెన్నుల పంపిణీ


నోట్ పుస్తకాలు అందిస్తున్న లింగస్వామి

చిట్యాల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద్దకాపర్తి గ్రామంలో బుధవారం సరస్వతీ దేవి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. పేరేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ కొలను సతీష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వట్టిమర్తి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో అర్చకులు భీష్మాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆ గ్రామ మాజీ సర్పంచ్ నర్రా మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతపల్లి మంజుల కృష్ణయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్యాల శ్రీకనక దుర్గా ఆలయంలో చిన్నారులు నృత్యాలు చేసి అలరించారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

మూలన పడేసిన బతుకమ్మ చీరలు


మునుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మూలన పడేసిన బతుకమ్మ చీరలు

మునుగోడు: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా రేషన్ కార్డు కలిగిన మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసేది. గత ఏడాది బతుకమ్మ పండుగకు ముందు మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని మహిళలకు పంపిణీ చేసేందుకు దాదాపు 3వేలకు పైగా చీరలను సరఫరా చేసింది. అందులో సగం వరకు లబ్ధిదారులకు అధికారులు పంపిణీ చేశారు. మిగిలిన చీరలు తీసుకునేందుకు అర్హులు రాకపోవడంతో మునుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మూలనపడేశారు. దీంతో ఇప్పటికి ఆ చీరలు ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వృథాగా మూలనపడి ఉన్నాయి. ఉన్నతాధికారుల అనుమతితో పేద మహిళలకు ఆ చీరలు పంపిణీ చేస్తే బాగుండని పలువురు మహిళలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పతకాలు సాధించిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి

రామగిరి (నల్లగొండ): క్రీడల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి వారికి డీఎస్సీలో ఉద్యోగాలు ఇవ్వాలని నిరుద్యోగ జేపీసీ చైర్మన్ పాల్వాయి రవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నల్లగొండలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాం 3,4 అండర్–17,19 యూనివర్సిటీ, ఇంటర్ లెవెల్‌లో మెడల్, సర్టిఫికెట్ సాధించిన వారికి 2 శాతం రిజర్వేషన్ కల్పించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పించాలని మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు. డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఈ రిజర్వేషన్, ఫాం 3,4 నిబంధనలు వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో రాచకొండ రమేష్, శివ, సిరాజ్ విష్ణు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవి

క్లుప్తంగా

నేడు సద్దుల బతుకమ్మ

రామగిరి(నల్లగొండ): సద్దుల బతుకమ్మ పండుగను గురువారం జిల్లా కేంద్రంలో అన్ని కాలనీల్లో, ఆలయాల్లో మహిళలు ఘనంగా జరుపుకుంటారు. ఇందు కోసం మున్సిపల్ శాఖ ఏర్పాట్లు చేసింది. బతుకమ్మ ఆడే కూడళ్ల వద్ద విద్యుత్ లైట్లను ఏర్పాట్లు చేసింది. నిమజ్జనం కోసం వల్లభరావు చెరువు వద్ద ఫ్లడ్ లైట్లను అమర్చారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని గొల్లగూడకు చెందిన 27 మంది మహిళలకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి బుధవారం చీరలు, గజ్జెలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న దసరా పండుగ

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 12వ తేదీన దసరా పండుగ నిర్వహించుకోవాలని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి కోరారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం దసరా పండుగ నిర్వహణపై నిర్వహించిన అఖిల పక్ష పార్టీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురువారం సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు


బెంచీలు అందజేస్తున్న సంతోష్‌యాదవ్

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో 25 ప్రధాన కూడళ్లు, ఆలయాల ఆవరణలో 50 సిమెంట్ బెంచీలను సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్‌యాదవ్ తన సొంత ఖర్చులతో బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ దంటు జగదీశ్వర్, సింగిల్ విండో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో చోటు

మునుగోడు: పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో మునుగోడు మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు చోటుదక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గోన మోహన్‌రావు, పుట్లపల్లి రవీందర్, జనగాం వెంకన్న, వి.ఎలీషా, డి.కళావతి, వై.సునిత, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డి. వెంకటేశ్వర్లు, ఎస్.చంద్రంలను ఎన్నుకున్నారు. వీరిని మునుగోడు మండలంలోని ఉపాధ్యాయులు బుధవారం పూలమాలల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యూసుఫ్‌పాష, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: కాన్షీరామ్ వర్ధంతిని బుధవారం జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి ధర్మసమాజ్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ శ్రీను, శంకర్, వెంకన్న, జగన్, ఎల్లయ్య, గిరి, వినోద్ పాల్గొన్నారు.

గొల్లగూడ విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు

నల్లగొండ: పట్టణంలోని గొల్లగూడకు చెందిన నుల ప్రణవ్ ఎంబీబీఎస్–24 ప్రవేశ పరీక్షలో 528 మార్కులు సాధించి కేటగిరి వన్‌లో మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందాడు. ప్రణవ్‌కు సీటు లభించడంపై అతడి తల్లిదండ్రులు నుల శ్రీహరి–శోభ ఆనందం వ్యక్తం చేశారు.

మంత్రికి వినతి

రామగిరి(నల్లగొండ): తొలితరం సినిమా హీరో టి.ఎల్.కాంతారావు శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలని కోరుతూ నల్లగొండ ఫిల్మ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య బుధవారం మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కోదాడ మండలం గుడిబండలో 1923 నవంబర్ 16న జన్మించిన కాంతారావు సుమారు 450 పైగా చిత్రాల్లో విలక్షణ పాత్రల్లో నటించి ప్రేక్షకుల అభిమానాలను పొందారని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని ఏపీ లింగోటం గ్రామానికి చెందిన మేడబోయిన జీవితకు బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.57 వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గడ్డం పశుపతి, బైరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తండ సైదులు, మేడబోయిన కళ్యాణ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.